# ‘మన ఊరు-మన బడి’పై పర్యవేక్షణ కరువు

- ఇంజినీరింగ్ అధికారులపై సభ్యుల ధ్వజం




మాట్లాడుతున్న ఎంపీపీ కరుణశ్రీ

ధర్మారం: మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన అభివృద్ధి పనులు పర్యవేక్షణ చేసే ఇంజినీరింగ్ అధికారి నిర్లక్ష్య వైఖరిపై సభ్యులు ధ్వజమెత్తారు. ధర్మారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మన ఊరు మన బడి కింద మండలంలో 18 పాఠశాలల్లో జరుగుతున్న పనుల జాప్యంపై మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి మండల విద్యాధికారిని ప్రశ్నించారు. ఇప్పటి వరకు కేవలం నాలుగు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయన్నారు. తాను మన ఊరు మన బడి కింద పనులు చేస్తుంటే కనీసం సంబంధిత ఏఈ పర్యవేక్షణ మచ్చుకైనా లేదని కొత్తూరు సర్పంచ్ మల్లేశం ఆరోపించారు. కనీసం ఫోన్ చేసినా స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. నర్సింగపూర్ ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ, మూత్రశాలలు, కనీసం గదులకు కిటికీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. బంజేరుపల్లిలో పాఠశాల పైకప్పు వర్షానికి ఊరుస్తూ ప్రమాదకరంగా మారిందని సర్పంచు గంగారెడ్డి తెలిపారు. ప్రైమరీ పాఠశాలలో నీటి వసతి కల్పించాలని కొత్తూరు సర్పంచు మల్లేశం కోరారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని వాటిని ఎప్పటికప్పుడు సరిచేయాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు డీఈఈ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో మంచినీటి బోర్ వెల్ మెకానిక్ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రైవేటు వ్యక్తులను నియమించినా పేమెంట్ ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని సర్పంచ్ జితేందర్‌రావు తెలిపారు. మేడారంలోని ఎరుకలవాడకు పైప్‌లైన్ నిర్మాణం చేసి నీటి కనెక్షన్ ఇవ్వడం లేదని ఎంపీటీసీ మిట్ట తిరుపతి ఆరోపించారు. వెంటనే కనెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పటి వరకు మంజూరు చేయలేదని ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డి విమర్శించారు. సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఎంపీడీవో జయశీల, డిప్యూటీ తహసీల్దార్ సింగిరెడ్డి మల్లారెడ్డి, మిషన్ భగీరథ డీఈఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# పెద్దపల్లి లయన్స్‌క్లబ్‌కు అవార్డులు




అవార్డు అందుకుంటున్న అధ్యక్షుడు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గతేడాది చేపట్టిన సేవా కార్యక్రమాలతో ఎంతో మంది పేదల కష్టాలను దూరం చేసినందుకు మల్టిపుల్ డిస్ట్రిక్ 320 తెలంగాణ, కర్ణాటక రాష్ట్రస్థాయిలో పెద్దపల్లి లయన్స్‌క్లబ్ అవార్డులను దక్కించుకుంది. పెద్దపల్లి క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శశాంక, వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్నారు.

**ఉచితంగా షుగర్ పరీక్షలు..**

పెద్దపల్లి బస్టాండ్ ఆవరణలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. 31మందికి షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు ప్రెసిడెంట్ భిక్షపతి తెలిపారు. నాయకులు వెంకటేశ్, ఆతీఫ్ ఉన్నారు.

# చిన్నారులకు తల్లిపాలే శ్రేష్టమైనవి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ అధికారులు

పెద్దపల్లిరూరల్: చిన్నారులకు తల్లిపాలే శ్రేష్టమని పెద్దపల్లి సీడీపీవో కవిత అన్నారు. పెద్దపల్లి పరిధిలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. మండలంలోని రాఘవాపూర్, అప్పన్నపేట, కాపులపల్లి, గోపయ్యపల్లి తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మహిళలకు అవగాహన కల్పించారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందని శిశువు ఎదుగుదలకు తల్లిపాలు దోహదపడతాయని అంగన్‌వాడీ టీచర్ శారద అన్నారు. హెచ్‌ఎం జితేందర్ రెడ్డి, ఆయా త్రివేణి, తల్లులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్ పుట్ట శైలజ

గోదావరిఖనిటౌన్: ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ సోమవారం రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిపో మేనేజర్ ఎం.నాగభూషణం, కార్పొరేటర్ కాల్వ స్వరూప శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

**మంథనిలో..**

మంథని: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో మంగళవారం మంథని డిపోలో కార్మికులు, అధికాలు సంబరాలు జరుపుకున్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, ప్రజాప్రతినిధులు, కార్మికులు, అధికారులు ఉన్నారు.

**పెద్దపల్లి బస్టాండ్‌లో..**

పెద్దపల్లిరూరల్: రాష్ట్రరోడ్డు రవాణ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని ఆర్టీసీ ఉద్యోగులు స్వాగతించారు. పెద్దపల్లి బస్టాండ్ ఆవరణలో మంగళవారం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు కోటేశ్వర్ తదితరులున్నారు.

## బీఆర్‌ఎస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలి

ఓదెల: ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు. మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లెలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచాయన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐదో డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు కాంగ్రెస్ నాయకులు ఎండీ రహీం వినతిపత్రం అందించారు. కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి పూల మొక్క అందించి అభినందనలు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందించి మాట్లాడారు. మల్కాపూర్ శ్రీనగర్‌కాలనీ ప్రధాన రహదారి రాజీవ్ రహదారి నుంచి ఓపెన్ కాస్ట్-4 వరకు ఉన్న రోడ్డు ఇరుకుగా రాకపోకలకు ఇబ్బంది ఉందన్నారు. ఎన్టీపీసీ ప్లాంట్ నుంచి వచ్చే వ్యర్థపు నీరు వర్షాకాలంలో రోడ్డుపైకి చేరి ప్రమాదకరంగా మారుతోందన్నారు. మల్కాపూర్ శివారులోని బ్రిడ్జి కూలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎన్టీపీసీ రామగుండం పునరావాస గ్రామమైన నర్రాశాల పల్లె ప్రధాన రోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతలుగా మారిందన్నారు. ప్రశాంత్‌నగర్ నుంచి సప్తగిరికాలనీ వరకు సీసీరోడ్డు వేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## కస్తూర్బా పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రం



ఓదెల: ఓదెలలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. బాలికల హాస్టల్‌లో మంగళవారం పరిసరాలు చెత్తాచెదారం ఉండగా పొక్లెయిన్‌తో మైదానం శుభ్రం చేశారు.

## పేదలకు అన్నదానం

గోదావరిఖనిటౌన్: గురు పౌర్ణమి సందర్భంగా భవానీ దీక్ష యజ్ఞ సేవాసమితి నిర్వాహకులు గురుస్వామి సురేశ్ భవానీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని పోచమ్మ ఆలయంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు ప్రేమలత, గూడెపు రమేశ్, పెద్దపల్లి రామస్వామి, వెంకటేశ్, సదానందం, రాంబాబు, శ్రీనివాస్, విక్కీ, సరస్వతి, కోటేశ్వరి, దివ్య, విజయ పాల్గొన్నారు.

## కామ్రేడ్ లింగన్న వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతిఘటన ఉద్యమ నేత సీపీ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ పూనం లింగన్న వర్ధంతి మంగళవారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకుడు అశోక్, బుచ్చమ్మ, పద్మ, శారద, నిర్మల, రాజనర్సు, కాంతయ్య, రాజేశ్వరి, మధునమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

## ‘చలో తిరుపతి’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని జెండా కూడలిలో గల కాన్షీరాం విగ్రహం వద్ద మంగళవారం అఖిల భారత ఓబీసీ 8వ మహాసభ పోస్టర్‌ను బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ ఆవిష్కరించారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో జరిగే 8వ మహాసభను విజయవంతం చేయాలని వారు కోరారు. నాయకులు లక్ష్మణ్, వీరయ్య, రామస్వామి, రాజకుమార్, కుమార్, చందు, వెంకటేశ్, గోపాల్, చంద్రశేఖర్ ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

**✦పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత**

రామగుండం: పట్టణంలోని మసీద్‌కార్నర్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్తున్న బండి రమేశ్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రామగుండం ఎస్సై వెంకటస్వామి, కానిస్టేబుల్ కిరణ్ సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు.

**✦గుంటభూమికి సాగునీరు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలింపు**

రామగుండం: అంతర్గాం మండల పరిధిలో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి స్థానికంగా గుంట భూమికి సాగునీరందకుండా హైదరాబాద్‌కు నీటిని తరలించుకోవడం సరికాదని, వందలాది ఎకరాలున్న దొరలకే రైతుబంధుతో రూ.లక్షలు చేరుతున్నాయని, కౌలు రైతులను గుర్తించి పరిహారం అందించాలని టీడీపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యంతో సబ్బండ వర్గాల త్యాగ ఫలంతోనే రాష్ట్రం సిద్ధించిందని, వచ్చిన తెలంగాణ దొరల చేతిలో బంధీ అయిందని వాపోయారు.

**✦ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన ఆకుల వెంకటేశ్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డిని కలిశారు.

**✦ముగ్గురిపై కేసు నమోదు**

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ టీ స్టాల్ వద్ద యువకులు మంగళవారం రాత్రి ఒకరిపై అకారణంగా దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా నివాసం ఉండే మహ్మద్ జూబేద్ అనే వ్యక్తిపై రాహుల్, స్టాలిన్, వినయ్ బస్టాండ్ వద్ద గల టీస్టాల్ వద్ద బండరాయితో జూబేద్‌పై దాడి చేశారు. దీంతో బాధుతుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోద చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**✦వరద బాధితులను ఆదుకోవాలి**

గోదావరిఖని: భారీ వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడుకొండలు కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**✦ప్రమాదబీమా చెక్కు అందజేత**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటకు చెందిన ఆవుల మహేందర్ పిడుగుపాటుకు మరణించారు. కాగా ఆయన కుటుంబీకులకు మంగళవారం రూ.10 లక్షల చెక్కును పోస్టల్ సూపరింటెండెంట్ ప్రభాకర్ అందజేశారు.

## క్లుప్తంగా

### రహదారులకు మరమ్మతు



సుల్తానాబాద్: భారీ వర్షాలకు రహదారులు దెబ్బతినడంతో మరమ్మతు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత తెలిపారు. పట్టణంలోని పూసాల రహదారుల వెంబడి రైతులకు ఇబ్బంది కలగకుండా ట్రాక్టర్ ద్వారా మంగళవారం చదును చేయించారు. రైతులకు ఇబ్బందిగా ఉన్న రోడ్లు ఉంటే వెంటనే సమాచారం ఇస్తే ట్రాక్టర్ ద్వారా చదును చేయిస్తామని ఆమె పేర్కొన్నారు.

**స్వచ్ఛ మంగళవారం జయప్రదం చేయాలి**

స్వచ్ఛ మంగళవారం జయప్రదం చేయాలని మున్సిపల్ మేనేజర్ అలీమోద్దీన్ కోరారు. సుల్తానాబాద్ పట్టణంలోని పలు వీధుల్లో మంగళవారం వార్డు అధికారులు సిబ్బంది స్వచ్ఛ మంగళవారంలో భాగంగా నీటి నిల్వలను తొలగించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

### గాలికుంటు నివారణ టీకా వేయించాలి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి

ఎలిగేడు: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయించాలని మండల పశువైద్యాధికారి ఝాన్సీ సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేటలో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. గ్రామంలో 119 ఆవులు, 152 గేదెలకు టీకా వేశారు.

**నట్టల మందు పంపిణీ..**

బుర్హాన్‌మియపేటలో 222 ఆవులు, గేదెలకు నట్టల నివారణ మందు వేశారు. సర్పంచ్ రాచర్ల కొండయ్య, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, పశు వైద్యసిబ్బంది ఉన్నారు.

### రేపు మండల సర్వసభ్య సమావేశం

ఓదెల: మండలం సర్వసభ్య సమావేశం 3న గురువారం ఉదయం 11గంటలకు ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

### ‘రామగుండం నుంచి అసెంబ్లీ బరిలో ఉంటా’

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని తెలంగాణ ఉద్యమ నాయకుడు పారుపెల్లి జీవన్‌రావు తెలిపారు. ఎన్టీపీసీ రామగుండంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నానన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కేసీఆర్ వేసిన అనేక కమిటీల్లో తాను ఉన్నానని, నియోజకవర్గాల్లోని వివిధ మండలాల్లో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం సంస్థలో యూనియన్ స్థాపించి ఉద్యోగుల కోసం పనిచేశానని, ఎన్టీపీసీ సంస్థలో ఉద్యోగం చేస్తూనే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్నానని పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గం నుంచి ఈసారి బీఆర్‌ఎస్ టికెట్ ఆశిస్తున్నానని, ఈ మేరకు సీఎం కేసీఆర్‌ను కలిసి దరఖాస్తు ఇస్తానని పార్టీ శ్రేణులు తనకు సహకరించాలని కోరారు.

### ధైర్యం చెప్పేందుకు వెళ్తే విమర్శలా




మాట్లాడుతున్న నాయకులు

మంథని: భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితులను ఓదార్చేందుకు మంథని మండలం నాగేపల్లికి వెళ్లిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై జెడ్పీచైర్మన్ పుట్ట మధు విమర్శలు సరికాదని కాంగ్రెస్ నాయకులు సెగ్గెం రాజేశ్, ఎరుకల ప్రవీణ్, కొండ మహేందర్ అన్నారు. మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. రైతులు పంట కోల్పోయి బాధలో ఉంటే రాజకీయాలు చేయడం తప్ప.. తొమ్మిదేళ్ల అధికారంలో ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. నాయకులు శశిభూషణ్ కాచే, అజీంఖాన్, రావికంటి సతీశ్ ఉన్నారు.

# స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న స్వీపర్ల సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: స్వీపర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు స్వీపర్ల సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు చాలీచాలని జీతం ఇవ్వడం అన్యాయమని జిల్లా సంఘం నాయకులు రాయలింగు, లక్ష్మయ్య, రాజయ్య ఆరోపించారు. కుటుంబాలను పోషించుకోలేని దుస్థితిలో ఉన్నామని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు.

## కార్మికులకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని, ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ పరిధిలో 569 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారని వారందరినీ క్రమబద్ధీకరించాలని, నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. జేఏసీ ప్రతినిధులు బండారి రవి, శశికుమార్, ఆడెపు శ్రీనివాస్, అశోక్, రాజబాబు, ఈసబ్, ఉమా మహేశ్వర్, మెట్టు శ్రీనివాస్, ఉదయ్, సునీల్, కనకయ్య, రాయమల్లు, మంథని లింగయ్య, రూప, ముంతాజ్, పద్మ, లక్కం శంకర్, సురేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

## గోదావరి తీరంలో బీఎస్పీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

కోల్‌సిటీ: రామగుండం మాంచెస్టర్ ఆఫ్ ఇండియా నుంచి డస్ట్‌బిన్ ఆఫ్ రామగుండంగా మారిందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ ఆరోపించారు. గోదావరి నది తీరంలో ఇటీవల వరదలతో మారిన పరిస్థితులపై మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పాలకవర్గ అలసత్వం, మేయర్ నిర్లక్ష్యంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోందని విమర్శించారు. నిరసనలో బీఎస్పీ ప్రతినిధులు సిరికొండ సది, తోకల స్వామి, బిస్వాస్, తోకల చంద్రయ్య, గోపాల్, గోపి, గణేశ్, మధు, గంగవ్వ, కమల పాల్గొన్నారు.

**జూలపల్లిలో ప్రచారం..**

జూలపల్లి: వచ్చే ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో బీఎస్పీని గెలిపించాలని కోరుతూ మహిళలు ప్రచారం చేస్తున్నారు. పెద్దపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన దాసరి ఉషను అభ్యర్థిగా ప్రకటించడంతో మహిళలు రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి గ్రామాల్లో బీఎస్పీ తరఫున ప్రచారం చేస్తున్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి




మాట్లాడుతున్న శరత్

గోదావరిఖనిటౌన్: ఎస్సీలోని 59 ఉపకులాలను ఏబీసీడీలుగా వర్గీకరించి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 29ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కొరకు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ నెల11న విశ్వరూప మహాసభ సన్నాహక సదదస్సును పెద్దపల్లి జిల్లా కేంద్రంలో, రామగుండం నియోజకవర్గంలో నిర్వహిస్తామని, సదస్సుకు ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. సన్నాహక సదస్సును, విశ్వరూప మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్, నాయకులు బి.రజనీకాంత్, మంథని చందు, ఎం.శ్రావణ్, కె.రాజయ్య, చంద్రశేఖర్, రాసపల్లి రవి పాల్గొన్నారు.

## వాటర్‌ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



వినతిపత్రం ఇస్తున్న యువత

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో కొంతకాలంగా సాంకేతిక సమస్యలతో ఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ యువత గ్రామ పంచాయతీ కార్యదర్శికి రమ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో తాగునీరు పూర్తిగా కలుషితమై ఉండడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సత్వరమే మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఊరటి మహేశ్, తమ్మనవేణి కుమార్, కోటి, ఉప్పల వెంకటేశ్, బీరెల్లి ప్రశాంత్, శ్రీనివాస్, లచ్చయ్య పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మంథని: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



కాల్వశ్రీరాంపూర్‌లో..

మంథని: గ్రామపంచాతీ ఉద్యోగ, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని మంగళవారం కార్మికులతో కలిసి ఆయా రాజకీయ పార్టీలు మంథని ఆర్డీవో హనుమకు వినతిపత్రం అందించారు.

జూలపల్లి: ఎంపీడీవో కార్యాయలం ఎదుట వేసిన దీక్షా శిబిరంలో గ్రామాల నుంచి వచ్చిన కార్మికులు నిరసన తెలిపారు. అబ్బాపూర్ ఎంపీటీసీ దండె వెంకటేశం కార్మికులకు మద్దతు తెలుపుతూ భోజనాలు ఏర్పాటు చేశారు. కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వైద్య సంపత్‌కుమార్, భాస్కర్, బాణయ్య, లచ్చయ్య, రాంచంద్రం, శంకరయ్య, నాగయ్య, మూగల లక్ష్మి, సతీశ్ పాల్గొన్నారు.

**చెవిలో పువ్వులతో నిరసన**

కాల్వశ్రీరాంపూర్: డిమాండ్ల సాధన కోసం కార్మికులు చేపట్టిన సమ్మె 27వ రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కోరుతూ చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు గట్టయ్య, నాయకులు రాజ బాబు, గౌసుద్దీన్, రామస్వామి, మధునయ్య, సంపత్, అనసూర్య, లక్ష్మి, అంజి, లక్ష్మణ్, సురేశ్ పాల్గొన్నారు.

ఎలిగేడు: జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజ, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, పారిశుద్ధ్య కార్మికులు ఆసంపల్లి చంద్రయ్య, సరీన్, కొండయ్య, మొగిలి, నర్సయ్య, సత్యనారాయణ, నర్సయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

ఓదెల: సమ్మెలో పాల్గొన్న కార్మికులు మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులు నాగయ్య, బ్రహ్మచారి, కుమార్, సతీశ్, నరేశ్, రంజిత్ పాల్గొన్నారు.